# చిరుతల మృత్యుఘోష

- హైవేలపైనే అత్యధిక ప్రమాదాలు
- వాహనాల కింద నలిగిపోతున్న మూగజీవాలు
- తాజాగా దగ్గి శివారులో చిరుత దుర్మరణం
- గతంలోనూ అనేక ఘటనలు
- కంచె ఏర్పాటుతోనే అడవి జంతువులకు రక్షణ
- ఆ దిశగా చర్యలు చేపట్టని ఎన్‌హెచ్ఏఐ అధికారులు
- ఉభయ జిల్లాల్లో భారీగా పెరిగిన చిరుత పులులు



కామారెడ్డి జిల్లా సరిహద్దులో ఇటీవల వాహనం ఢీకొనడంతో మృత్యువాత పడిన చిరుత

నిజామాబాద్ (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ ఇందల్వాయి, డిసెంబర్ 16: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. చిరుతపులులు వరుసగా దుర్మరణం చెందుతున్నాయి. ఎన్‌హెచ్ఏఐ, అటవీ శాఖ వైఫల్యం మూలంగా వన్య ప్రాణులు ప్రమాదాలకు గురవుతున్నాయి. పచ్చని అడవుల్లో సంచరించాల్సిన అడవి జంతువులు దారి తప్పి రోడ్లపైకి వస్తుండటంతో భారీ వాహనాల కింద నలిగిపోతున్న ఘటనలు పెరిగి పోతున్నాయి. తాజాగా గురువారం రాత్రి నిజామాబాద్ – కామారెడ్డి జిల్లా సరిహద్దులోని మంచిప్ప రిజర్వ్ ఫారెస్ట్‌లో 44వ జాతీయ రహదారిపై చిరుతపులి మృతి చెందడం అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నది. వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకోవడంలో వైఫల్యం మూలంగా మూగ జీవాల ఆయుష్షు అర్థాంతరంగా ముగిసిపోతున్నది. నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాల్లో కనీస చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురిస్తున్నది. గతంలో కంటే చిరుత పులుల సంఖ్య ఉమ్మడి జిల్లాలో భారీగా పెరిగింది. పెరిగిన అడవి జంతువులకు రక్షణ కవచం లాంటి చర్యలు తీసుకోవడంలో అటవీ శాఖ మరింత శ్రద్ధ చూపితే బాగుంటుందని జంతు ప్రేమికులు పేర్కొంటున్నారు.

### డెడ్ స్పాట్‌గా దగ్గి..

మంచిప్ప రిజర్వ్ ఫారెస్ట్, సిర్నాపల్లి అటవీ ప్రాంతాల కలయికకు దగ్గి, చంద్రాయన్‌పల్లి ప్రాంతాలు సరిహద్దు. ఈ స్థలమే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను సైతం వేరు చేస్తున్నది. ఉభయ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో దగ్గి గ్రామం కామారెడ్డి జిల్లాలో, చంద్రాయన్‌పల్లి తండా నిజామాబాద్ జిల్లా పరిధిలో ఉంటుంది. ఈ రెండు గ్రామాల మధ్యలో విస్తరించిన దట్టమైన అటవీ ప్రాంతంలో నిత్యం అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నా యి. అడవులను అడ్డంగా నరికి వేయడం మొదలు వన్య ప్రాణులను వేటాడడం తరచూ జరుగుతున్నది. అటవీ శాఖ వైఫల్యం మూలంగా అడపాదడపా ఈ ఘటనలు పునరావృతం అవుతున్నాయి. ఇదే ప్రాంతం మీదుగా 44వ జాతీయ రహదారి సైతం విస్తరించి ఉంది. రాత్రివేళల్లో అటవీ జంతువులు ఈ రోడ్డు దాటుతూ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. భారీ వాహనాలను నియంత్రించలేక డ్రైవర్లు అడ్డొచ్చిన మూగ జీవాలను ఢీకొడుతున్నారు. రాత్రివేళల్లో అకస్మాత్తుగా జంతువులకు అడ్డు రాకుండా ఫెన్సింగ్ లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్న క్రూర మృగాలు, ఇతర జంతువుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. నెలన్నర కిందట దగ్గి ప్రాంతంలోనే ఓ జింక మృతి చెందింది. డిసెంబర్ 14న చిరుత పులి రోడ్డు ప్రమాదంలో బలి కావడం ఆందోళనకు గురి చేస్తోంది. దగ్గి–చంద్రాయన్‌పల్లి శివారులోని కేవలం నాలుగు కిలోమీటర్ల పరిధిలో గతంలో మూడు చిరుతలు మృత్యువాత పడ్డాయి. ఈ ప్రాంతం అటవీ జంతువులకు డెడ్ స్పాట్‌గా మారినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.



నవీపేట్ మండలం జగ్గరావు ఫారం ఏరియాలో వాహనం ఢీకొని మృతిచెందిన చిరుత (ఫైల్)

### పెరిగిన చిరుతలు..

2018లో రాష్ట్రంలో జంతు గణన జరిగింది. ఆ తర్వాత గతేడాది తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రయత్నాన్ని ఎంపిక చేసిన అటవీ ప్రాంతాల్లోనే చేపట్టింది. టైగర్ రిజర్వ్ ఫారెస్టుల్లోనే జంతు గణను చేపట్టినప్పటికీ మిగిలిన చోట్ల ఆసక్తి కలిగిన అటవీ శాఖ సిబ్బంది జంతు గణనను నిర్వహించారు. శాస్త్రీయబద్ధంగా జంతు గణనను చేపట్టనప్పటికీ ఉమ్మడి జిల్లాలో చిరుతల సంచారం భారీగా పెరిగిందని తెలుస్తోంది. అడవుల్లో కలియ తిరిగిన సంబంధిత సిబ్బంది కనిపించిన ఆనవాళ్ల ప్రకారం, ఆయా గ్రామాల్లో చిరుత పులులు కనిపించిన సందర్భాల అనుసారం వీటి సంఖ్య 50 వరకు చేరినట్లుగా గుర్తించారు. గతంలో కేవలం పదుల సంఖ్యలోనే ఉన్న క్రూర మృగాల సంఖ్య ఇప్పుడేకంగా అర్ధ శతకానికి చేరడంతో అప్రమత్తం కావాల్సిన అటవీ శాఖ మాత్రం చేతులు ఎత్తేసినట్లుగా ఉండడం ఇప్పుడు శోచనీయంగా మారింది. వేటగాళ్ల నియంత్రణలో సక్సెస్ అయిన అటవీ శాఖ అధికారులు.. రోడ్డు ప్రమాదాల్లో మూగ జీవాల ప్రాణాలు పోకుండా చర్యలు చేపట్టడంలో వైఫల్యం చెందడం చర్చనీయాంశమవుతున్నది. నిజామాబాద్ డివిజన్ పరిధిలో 52,133 హెక్టార్ల విస్తీర్ణం, ఆర్మూర్‌లో 33,778 హెక్టార్లు, కామారెడ్డి 40,500హెక్టార్లు, బాన్సువాడ డివిజన్‌లో 40,000 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఆయా అడవుల్లో ఎలుగుబంట్లు, నక్కలు, జింకలు, సాంబార్, కొండ గొర్రెలు, దుప్పిలు, నీల్గాయి, తోడేళ్లు, మనుబోతులు, అడవి కుక్కలు, కుందేళ్లు, అడవి పిల్లులు, అడవి పందులు వందల సంఖ్యలో ఉన్నాయి.

### వసూళ్లపైనే దృష్టి..

క్రూర మృగాలు, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు చేపట్టాల్సిన జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కేవలం టోల్ వసూళ్లపైనే దృష్టి సారించిన ఈ సంస్థ.. జంతు సంరక్షణ చర్యలను గాలికొదిలేసింది. వాస్తవానికి నిబంధనల ప్రకారం జాతీయ రహదారికి ఇరువైపులా రక్షణ కంచెలు నిర్మించాలి. అడవి జంతువులు రోడ్లపైకి రాకుండా ఫెన్సింగ్ నిర్మించాల్సి ఉంటుంది. 44వ జాతీయ రహదారి విస్తరించిన ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో రక్షణ కంచెలు నిర్మించిన ఎన్‌హెచ్ఏఐ.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మాత్రం విస్మరించింది. ఫలితంగా తరచూ వన్యప్రాణులు రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నాయి. టోల్ వసూళ్లపై ఉన్న శ్రద్ధ ఫెన్సింగ్ నిర్మించడంలోనూ చూపాలని జంతు ప్రేమికులు ఎన్‌హెచ్ఏఐ అధికారులను కోరుతున్నారు.

### నేషనల్ హైవే అథారిటీకి లేఖలు రాశాం...

చంద్రాయన్‌పల్లి అటవీ ప్రాంతంలో నీటి జాడలు పెరగడం మూలంగా జంతువుల కదలికలు విస్తృతమయ్యాయి. తద్వారా అడవి జంతువులు ఆ ప్రాంతంలో ఎక్కువగా తచ్చాడుతున్నాయి. మూగ జీవాల రక్షణ కోసం అండర్ పాస్‌లు నిర్మించాలని, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు లేఖలు రాశాం. వారి నుంచి స్పందన రాలేదు. ఇకపై జంతువుల ప్రాణాలను కాపాడేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటాము.

**- కె.రామ్‌కిషన్, ఇన్‌చార్జి డీఎఫ్‌వో, నిజామాబాద్**

## మానిక్‌బండార్ ఘటనలో పలువురిపై కేసు నమోదు

మాక్లూర్, డిసెంబర్ 16: మండలంలోని మానిక్‌బండార్ శివారు ప్రాంతంలోని తండాలో క్షుద్రపూజల నేపథ్యంలో దాడి ఘటనకు సంబంధించిన కేసులో పోలీసులు పలువురిని గుర్తించి కేసులు నమోదు చేశారు. మానిక్ బండార్ తండాలోని శ్మశానవాటికలో గురువారం రాత్రి క్షుద్రపూజలు చేస్తున్నారనే అనుమానంతో అరవింద్, పూజలో పాల్గొన్న 12 మందిపై తండావాసులు దాడిచేశారు. ఈ దాడిలో ఏఎస్సై గంగాధర్ గాయపడగా.. మూడు పోలీసు వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. విధులకు అడ్డు తగలడంతో పాటు మూడు పోలీసుల వాహనాల అద్దాలు పగులకొట్టిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. ఈ కేసులో కొందరిని అరెస్ట్ చేశామని, మరి కొందరిని అరెస్ట్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు.క్షుద్రపూజలు చేస్తున్న అరవింద్‌పై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు.

## నవోదయలో నేడు పూర్వవిద్యార్థుల సమావేశం

నిజాంసాగర్, డిసెంబర్16: నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో నేడు (ఆదివారం) పూర్వ విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వినయ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించడానికి ప్రిన్సిపాల్ సత్యవతిని ఆహ్వానించామని చెప్పారు. నవోదయ పాఠశాలలో ఇప్పటి వరకు చదివిన 32 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. సమ్మేళనానికి దేశంలోని పలు రాష్ట్రాలతోపాటు ఇతర దేశాల్లో ఉన్న వారు సైతం తరలి వస్తారని తెలిపారు. సమావేశంలో భాగంగా ప్రస్తుతం నవోదయలో చదువుతున్న విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తామని అన్నారు. ఆయన వెంట పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి రేణుకాకుమారి, ఉపాధ్యక్షుడు బాశెట్టి నాగవేందర్ ఉన్నారు.

## ఎంపీ బీబీ పాటిల్ సోదరుడి మృతి

డోంగ్లీ, డిసెంబర్ 16: జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సోదరుడు విఠల్‌రావు బస్వంత్‌రావు పాటిల్ శనివారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు. అతడి అంత్యక్రియలు ఆదివారం ఉదయం వారి స్వగ్రామం డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్ గ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడి మృతికి పలువురు సంతాపం ప్రకటించారు.



బస్వంత్‌రావు పాటిల్ (ఫైల్)

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

తెలుగులో ఉచిత ఖుర్‌ఆన్ కొరకు
ఫోన్ చేయండి
1800 572 3000
సమస్యలన్నిటికీ పరిష్కారం దైవసందేశం ద్వారానే సాధ్యం

WANTED
★Nursing staff ANM/B.Sc. Nursing staff & ICU & Receptionist for Hospital Contact No. 87903 32690/ 9346605125
NTZ-318807

WANTED
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

SCHOOL BUILDING SALE
★Running School Building for Sale in Armoor, District: Nizamabad, TS. Total Area 1600 Sq.yds., Total Slab Plinth Area 21000 Sft. Call: 7989918123.
NT-313178-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.